# చీకటి

రోడ్డు మీద-

పోలీసుల బూట్ల టకటకలు అన్యాయాన్ని, అశాంతిని కాపలా కాస్తున్న శబ్దాలు-

నిషేధాజ్ఞల వల్ల నగరంలో తలుపులు కిటికీలు అన్నీ మూసి ఉన్నాయి. సమయం అర్ధరాత్రి కాబట్టి దాదాపు ప్రజలందరి కళ్ళూ మూసుకునివుంటాయ్. కాకపోతే పచ్చబంగళాపై నుండి కిటికీలోంచి బయటికి చూస్తూ ఎదురు చూస్తున్న ఓ రెండు కళ్ళు మినహా-

లైట్లన్నీ ఆర్పేసి ఉన్నాయ్-బీదవాడి ఆశల్లాగ ఒకటి మాత్రం రెడ్ బెడ్‌లైట్-అదే పచ్చబంగళా కిటికీలోంచి కనిపిస్తుంది.

అక్కడక్కడ తుపాకి కాల్చిన చప్పుడు అప్పుడప్పుడు వినిపిస్తుంది. అంటే, అశాంతి కాలిపోతుంది. భయంకర శాంతి మాత్రం నగరం నలుమూలలా నిలిచివుంది. ప్రజల గుండెలు మాత్రం అంతర్జ్వలితాలు-వాటిని చల్లార్చే ప్రణాళికలులేవు. ఏర్పరిచే వాళ్ళులేరు.

బలప్రయోగాలవల్ల ఏర్పడే శాంతి గుండెల్లోంచి అశాంతి ఉద్రుతంగా మండుతున్న రూపంలో వెలువడుతుంది.

ఇదంతా కాపలా కాస్తున్న పోలీసులకు తెలియదు. తెలిసినా వాళ్ళ కర్తవ్య నిర్వహణను వాళ్ళే ఎదిరించే తాహతులేదు. ఎదిరిస్తే వాళ్ళ జీవితం పనికిరాకుండా పోతుంది. వాళ్ళు కూడా మనుషులేకదా!

అందుకే, చల్లటి చలికి వణికిపోతున్న గుండెలకు వెచ్చని పొగనందిస్తున్నారు. ఆ బంగళా కిటికీ అద్దం వెనకనుంచి ఆ రెండు కళ్ళూ ఇంకా ఎవరి కోసమో ఎదురు చూస్తున్నాయ్!

ఎవరి కోసమో కాదు-ఎవరైనా సరే అని! :

ఆమె పేరు భామినో కామినో, కావచ్చు. కాకపోనూ వచ్చు. ఎందుకంటే ఇక్కడ దానితో అక్కరలేదు. గనక!-ఆమెకు నిర్వచనం ఆమె!

ఆమెకో ప్రత్యేక స్థానం ఉంది.

ఆమె వృత్తి-చెడు: దాని ఫలితం నుంచే ఆమె మంచిని పెంచుతోంది.

మంచి ఫలితం-చెడుకు ధారపోయడంకన్నా, ఇది వెయ్యిరెట్లు నయం కదూ!

ఆమె ప్రతి క్షణం చచ్చిపోతూ-మరో పచ్చని జీవికి ఉచ్ఛ్వాసా నిశ్వాసాలందిస్తుంది.

ప్రతిక్షణం తనహీనతను, బలహీనతను లోకం ముందు పరుస్తూ, మరొకరికి బలాన్ని, ఔన్నత్యాన్ని కలిగిస్తుంది.

ఆమెకు-రైలు బొగ్గుకూ తేడాలేదు.

కాలిపోతున్నా నన్న ధ్యాస ఆమెకులేదు. తనకొడుకు జీవితం రైలు చక్కగా ప్రగతి పథంలోకి వెళ్తే చాలు.

సహజంగా ఆడదాన్ని అందంగా పుట్టిస్తాడు దేవుడు. కాని ఆడవాళ్ళందరు అందంగా వుండాలన్న నియమం లేదు. కాని ఆ నియమం ఆమెపట్ల వర్తిస్తుంది. ఆకర్షణ ఆమెలో నర్తిస్తుంది-

ఆమె-అందానికి ఉదాహరణ:

ఆమె దగ్గరకు వచ్చే వాళ్ళందరూ మత్తులో చీకట్లను చీల్చుకుంటూ ఏదో వెలుగుకోసం వస్తారు. ఆమత్తులో వాళ్ళకు ఆమె ముఖంలోని అందం కనిపించదు. మెరుస్తున్న ఓ స్త్రీ ఆకారం తప్ప! మత్తులేని వాళ్ళకు సైతం కలుగుతుంది. ఆమెను చూడగానే-వాళ్ళు చూడలేరు-ఆమె ముఖవర్చస్సు!

అయినా వాళ్ళకు దానితో పని లేదేమో !!

నిజానికి ఆమె అందాన్ని హృదయ పూర్వకంగా ఆరాధించే వాళ్లెవరూ లేరు-

అందరూ తేనెటీగలే తప్ప తుమ్మెదవలెవరూ కాదు! అందరూ ఆటగాళ్ళే. ఆమె జీవిత "ఎంపైర్" ప్రస్తుతం ఎవరూలేరు.

ఉండేవాడొకతను. మొదట్లో-కొడుకును మినహా ఏమీ ఇవ్వకుండా అడ్రసులేని చోటికి వెళ్ళిపోయాడు. అందరూ ఆమెను పొడిచేవారే-సూటి పోటి మాటలతో - జాలి కన్నీటి కథ నెవడూ వినడు. చెప్పే ప్రయత్నం ఆమె చెయ్యదు. చేసినా ఎవరూ వినరు

అందరూ పిసికేవారే - పరోక్షంగా బలవంతాన ఆమె రక్తాన్ని శరీరం నుంచి.

ఆమె ప్రతిరోజు ప్రతిసారి నిస్సహాయురాలు -

వచ్చేవాళ్ళు ఆమె శవంతో పోరాడి సురీ పోతారు. ఆమె వాళ్లను భరించడంకాదు. వాళ్లడబ్బు పెట్టే బాధల భరిస్తుంది-

అయినా ఆమెకు డబ్బుకావాలి అందుకే

ఆమెకు వాళ్ళు అయిష్టంతో కావాలి—

అందుకు కారణం ఆమె "ఆకల"యితే - ఎప్పుడో చచ్చిపొయ్యేది కాని తన 'చిన్ని చిన్నడూ?

తన శరీరంలో మాంసము. చర్మమూఉన్న కాలంలోనే - తన ఆశల రూపమైన ఆ చిన్ని మొలక పచ్చగా ఎదిగి, తనకు తానే పెరగగలిగే స్థితికి వస్తేచాలు ఆ తరువాత ఈ "పీళ్లంతా" తన అస్థిపంజరంతో ఎన్ని క్రీడలు

జరుపుకున్నా పరవాల్లేదు. ఎందుకంటే అప్పుడు వాళ్లవల్ల బాధవుండదు వాళ్ల డబ్బూ అవసరముండదు:

గుండెలో రక్తంసలసల మసలుతున్నా, పైకిమెత్తని నవ్వులు నవ్వాలి- దిగుళ్లు మింగాలి - చలాకి మాటలు విసరాలి

దేహంలోని ప్రతి అణువూ అసహ్యంతో కంపిస్తున్నా వాటినేహాయిగా మార్చాలి - భరించలేని ఆనందాన్ని భరించాలి. అనందాన్నందిచాలి.

అణువణువును, క్షణక్షణాన్ని ధనంతో లెక్కకట్టి తీసుకోవాలి- నిద్రరాదు —

వచ్చే సూచనలున్నా. కలతలు సాగనీయవు.

ఆలోచనలు- మెదడుకు రంధ్రాలు చేస్తున్నట్లు

"తనకొడుకుకు - తెల్లవారితే పరీక్ష ఫీజు పంపించాలి. నగరానికి-శ్రీదా వాడిజీవితం కుంటుపడుతుంది. ఇక్కడేమో 'కరువు' వుంది - వారం రోజు ల్నుండి. వచ్చే వాళ్లెవరూరారు. వేరేకష్టానికి తనెటూపోలేదు - పోకూడదు-ఉన్న డబ్బు అయిపోయింది. నాలుగురోజులుగా తినడానికేమీ లేదు. కనీసం పెంపుడు కుక్కకు వెయ్యడానిక్కూడ-"

ఒక్కసారిగా గడియారం వైపు చూసింది. శబ్దం అటునుంచి రావడం లేదు. అదెప్పుడో ఆగిపోయి వుంది. ఆమె గుండెశబ్దం ఆమెకు స్పష్టంగా విని పిస్తోంది -

ఇంతలో ఎవరో - మెట్లెక్కుతున్న చప్పుడూ, ఆతరువాత తలుపుతట్టిన చప్పుడూ వినవచ్చాయి. రెడ్ బెడ్ లైట్ ఆఫ్ చెయ్యడానికి కదలబోయింది. అవయవాలు స్వాధీనంలోలేవు, బలవంతాన స్విచ్ బోర్డువైపు వెళ్లూనే తూలి పడిపోయింది. మళ్ళీ ప్రయత్నించి లేచి, లైటాఫ్ చేసింది.

కటిక చీకటి - ఆమె జీవితంలాగ, చీకట్లు కళ్లను పొడిచేస్తున్నాయ్ ఏమీ కనిపించడంలేదు. గోడనాసరాగా చేసుకొని తలుపుదాకా వెళ్ళింది.

ఆ క్షణం ఆమెతో ఎంత సంతోషం! ఆకలి కరకరలాడుతుంది. పేగుల రోదన వినిపిస్తుంది. కాని సమయం మారింది. అందుకే ఆమెరోదనలోసంగీతం

వినగల్గుతుంది. దాన్నించే ఆనందం పొందుతుంది-అందివ్వడానికి!

ఆ అగంతకుడు 'కర్ఫ్యూ' ఉండగా ఎలా వచ్చాడన్న ఆలోచన రాలేదామెకు -

"అతడొస్తాడు - తనుభరిస్తుంది.

కనీసం యాభై రూపాయలైనా అడగాలి. అతడిస్తాడు, ఉదయం ఎలాగో పరీక్ష జీతం పంపొచ్చు" అన్న ఆలోచనలు తప్ప -

తలుపు తెరిచింది-అంతవరకున్న బాధలు మరుస్తూ;

ఒక్కసారిగా చల్లగాలి తగలడంవల్ల ఆమెనాడులు జివ్వుమన్నాయ్. ఏదో నూతనోత్సాహం ప్రవేశించినట్లయింది. గాలికి—గోడమీది కేలండర్ లయబద్ధంగా మూడుసార్లు కొట్టుకుంది.

అతడుఠీవిగా లోనికొచ్చాడు. లాంగ్ కోటు విడుస్తూ-ఆమె తలుపువేసింది. పెదవి కొరికింది.

పళ్ళమధ్య క్రింది పెదవినలిగి పోయింది-ఆమె విధి పళ్ళక్రింది నలిగి పోయినట్లు -

అతడు బట్టలిడిచేస్తున్నట్లు - లీలగా కనిపిస్తుంది అలాగే ఒకరి ఆకారం ఒకరికి! - అంతే!

కొడుకు బాగు కోసం తోలు ఒలువడానికైనా సిద్ధంగావున్న ఆమె, ప్రస్తుతానికి గుడ్డ లొలుద్దామనుకుంది. రెండు అడుగులు బరువుగా నడవడమైనా చేతగాక, తూలి కూలిపోయింది నిలువునా -

బంగళా క్రింద పెంపుడు కుక్కను పోలీసు బలంగా తన్నాడు కాబోలు - హీనంగా ఏడుస్తుంది. యజమానురాలి బాధను తన స్వంతం చేసుకున్నట్లు -

ఆమె నుండి అతడు దేనికోసమో ప్రాకులాడుతున్నాడు. అంత సేపామె శరీరానికీ, ప్రాణానికి యుద్ధం జరిగింది. ఆ యుద్ధం ముగిసింది. ....

ప్రాణానికీ, శరీరానికి రాజీ కుదిరింది.

శ్వాస సరిగా జరుగుతుంది.

ఆమెకు పరిసరాలు జ్ఞాపక మొచ్చి కళ్ళు తెరిచే సరికి, అతడు వెళ్ళి పోవడానికి తలుపు దాకా వెళ్ళాడు —

ఒక్కసారిగా పరుగెత్తి పట్టుకుంది. అంతపని ఆమె చేయలేదు. ఆమెలో దాగిన శక్తులేవో చేయించాయి —

అడ్డంగా —

చెయ్యి చాపింది - అతడు తొలగించు కున్నాడు.

ఏదో మాట్లాడదామని ప్రయత్నించింది. నోరు పెగల్లేదు. షాక్ తిన్న దానిలా వెళ్ళి ట్యూబ్ లైట్ వేసొచ్చింది.

ఒక్కసారిగా లైట్ వెలిగే సరికి, వెనుతిరిగి చూశాడతను అతణ్ణి చూడగానే, ఆమె గుండెను ఎవరో ముక్కలు నరుక్కుతిన్నట్లు, గొంతు వరకు భయం - ఒక నిముషం వరకు —

అతను ...............అతను......... ... క్రింద కాపలా కాస్తున్న పోలీస్ !!!

తరువాత మళ్ళీ పరిస్థితి అర్థమై చెయ్యి చాపింది. అతడు రుసరుసా చూశాడు - తన బాధనంతా వెళ్ళగ్రక్కు దామనుకుంది. ప్రార్థిద్దామనుకుంది - కాని శక్తిలేదు. రెండు కాళ్ళూ గట్టిగా పట్టుకుంది. తన్ని ఒక కాలు విడిపించుకున్నాడు. భయం మరీ అధికమైంది - అతి కష్టం మీద చిన్నగా ఏడుపు మొదలయింది.

"ఊఁ ... ఊఁ .... వదులు - ఏడుపు మొదలు బెట్టకు, అల్లరి చేసావంటే. బయటికి వచ్చావనే నెపంతో కాల్చెయ్యగల్ను - కర్ఫ్యూ ఉంది. తెలుసుగా -" చేదు, కఠినత్వం. రౌద్రం అన్నీ కలిసి పోలీసు మాటలు అతి భయంకరంగా వున్నాయ్.

వదిలించుకొని అతడు మెట్లవైపు వెళ్తున్నప్పుడు గట్టిగా కెవ్వున కేకెయ్యాలని పించింది. అల్లరి చెయ్యాలని పించింది. అరవాలని పించిది. శక్తి చాలలేదు. అన్నీ గుండెలోనే ఆరిపోయ్యాయి కాని ఏడుపు మాత్రం కొంచెం అధికమైంది.

ఎండిపోయిన పెదవులు కన్నీళ్ళలోనాని కొంచెం మెత్తబడ్డాయ్.

కాలు వదిలించుకోవడానికి తన్నినపుడు బూటు మేకు బాగా లోతుకు మోకాలికి గ్రుచ్చుకు పోయింది, రక్తం కారిపోతుంది.

కొంగుతో తుడుద్దామనుకునేసరికి జ్ఞాపకమొచ్చింది. వంటి మీద గుడ్డలేవని.

అప్పుడేకో మత్తువదిలి నట్లయింది. తన గది స్పష్టంగా అగుపిస్తోంది. తన బట్టలు అక్కడ కింద - తన ప్రేగులన్నీ పీకి కుప్ప పెట్టినట్లు !!

శరీరమంతా వణుకు మొదలయింది.

హృదయాన్నీ. మెదడునూ, ఎవరో రోట్లోవేసి రుబ్బుతున్నట్లు - భయం.

గాయాన్ని నాలుకతో అదిమి, మోకాలు చుట్టూ చేతులు కప్పుకుంది.

ఆమె కళ్ళు - ద్వేషం, కసీ ఇంకా ఎన్నో అగ్ని వర్షాలు కురిపిస్తున్నాయ్ - శపిస్తున్నాయ్.

కాని, అతను తాపీగా మెట్లు దిగుతున్నాడు.

ఏదో అరుద్దామనుకుంది, కాని అది 'గుసుపు'గా మారింది. అసలే నాలుగు రోజుల్నిండి శవంగా మారి ఉంది.

మెట్లమీది నుండి టకటక శబ్దాలు జారి పోయ్యాయి. ఆ శవం ఇంకా అలాగే భయంకరంగా అటువైపు చూస్తోంది !!

రోడ్డు మీద -

పోలీసుల బూట్లు టక టకలు, అన్యాయాన్ని అశాంతిని కాపలా కాస్తున్న శబ్దాలు —

1970

—